క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు


కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

బొజ్జాను విడుదల చేయాలి

వెలుగోడు: రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడం అక్రమమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుతోట రాజశేఖర్, రైతు సంఘం సీనియర్ నాయకులు యాదాటి నాగేంద్రుడు అన్నారు. బొజ్జా అరెస్టును నిరసిస్తూ మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉదారు రామలింగేశ్వర రెడ్డి, నసిరుల్లా ఖాన్, ముక్క మల్ల భాస్కర్ రెడ్డి, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్'ను విజయవంతం చేయండి

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఎంపీడీఓ మేరీ అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామీణ స్థాయిలో ఏ మేరకు అమలు అవుతున్నాయో తెలుసుకునేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12 నుంచి 18వ తేది వరకు అన్ని గ్రామాలలో యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 12న దుద్యాల, 13న నందికుంట, కొత్తపల్లి, 14న జి. వీరాపురం, గువ్వలకుంట్ల , 15న శివపురం, గుమ్మాడాపురం, 16న ముసలిమడుగు, ఎర్రమఠం, 17న గోకవరం, ఎదురుపాడు, 18న కొక్కెరంచ గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఉంటుందన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు


మల్యాలలో అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంచుతున్న గ్రామస్తులు

నందికొట్కూరు రూరల్ : మండలంలోని మల్యాల గ్రామంలో అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలను గ్రామస్తులకు మంగళవారం పంపిణీ చేశారు. అక్షింతలకు గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లనాయుడు, గ్రామస్తులు రమేష్, పీరయ్యస్వామి, శ్రీరాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

మిడుతూరు: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో ఈనెల 9 నుంచి రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 9న చెరుకుచెర్లలో, 19న మిడుతూరు జిల్లా పరిషత్ పాఠశాలలో, 23న తిమ్మాపురం, 30న మిడుతూరు -2 సచివాలయం, ఫిబ్రవరి 6న అలగనూరు, 13న నాగలూటి, 23న జలకనూరు, మార్చి 1న వీపనగండ్ల, 15న చౌట్కూరు, 22న దేవనూరు, 30న చింతలపల్లిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం


నూతన సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు, అధికారులు

ఆత్మకూరు: పట్టణాభివృద్ధే తమ లక్ష్యమని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్, వైస్ చైర్మన్ రాజగోపాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 20వ వార్డు పరిధిలో రూ.10 లక్షలతో నూతన సీసీ రోడ్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 20వ వార్డు సభ్యులు సీసీ రోడ్డు ఏర్పాటు చేయమని ఎమ్మెల్యేను కోరారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విజయచౌదరి, రంగస్వామి, కలిముల్లా, పాన్‌బాషా, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

- ఆరు గ్రామాల్లో రూ.2.35కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం
- గ్రామాల్లో అత్యాధునిక వసతులతో భవనాలు
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



పెద్ద దేవళాపురంలో డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, సంతజూటూరులో రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

మహానంది: గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే గ్రామాల్లో కోట్ల రూపాయలతో అత్యాధునిక వసతులతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఇతర ప్రభుత్వ భవనాలు నిర్మిస్తోందని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఇదంతా ప్రతిపక్ష పార్టీ నేతలకు కనిపించపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. బండి ఆత్మకూరు మండలం నారాయణపురం, పెద్ద దేవళాపురం, చిన్న దేవళాపురం, బోధనం, సంతజూటూరు, పరమటూరు గ్రామాల్లో రూ.2.35 కోట్లతో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, జగనన్న పాల వెల్లువ కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను మంగళవారం ప్రారంభించారు. శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డితో కలిసి ముందుగా నారాయణపురం గ్రామంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అన్ని సేవలూ గ్రామాల్లోనే..

గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, తదితర వాటి ద్వారా అన్ని వర్గాలకు గ్రామస్థాయిలోనే సేవలు అందుతుంటే అభివృద్ధి లేదనడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాల్లోనే పాలన సాగిస్తూ పేదల మనుస్సులో చిరస్థాయిగా నిలిచిపోయిన సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓటమి భయంతోనే ప్రతిపక్ష నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా పేదలకు ఇంటికే పథకాల లబ్ధి చేరుతుందని, రైతులకు గ్రామ స్థాయిలోనే అన్ని రకాల సేవలు అందుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో సంక్షేమ పథకాలు పచ్చనేతలు చెప్పినవారికే వచ్చేవని గుర్తు చేశారు. పేదలకు అందే పథకాలన్నీ కొనసాగాలంటే మరోసారి మన సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఇద్దరు చేరితే రెండొందలంటూ విష ప్రచారం

గ్రామాల్లో నాయకులు ఇద్దరు చేరితే మా పార్టీలో రెండొందల మంది చేరారని చెప్పడం ప్రతిపక్ష నేతలకే చెల్లుతుందన్నారు. పార్టీలో చేరికలంటూ వస్తున్న వార్తల్లో ఎంత మాత్రం వాస్తవమన్నది గ్రామాల ప్రజలకు తెలుసన్నారు. తప్పుడు ప్రచారాలను నమ్మేవారు లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో శ్రీశైలం నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, ఎస్డీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి, సర్పంచులు సరిత, పరమటూరు జగన్, భోధనం భాస్కర్‌రెడ్డి, ఆవులపాటి మధు, మార్కెట్ యార్డు డైరెక్టర్ విక్రమసింహానాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వెలుగోడులో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

వెలుగోడు: పట్టణంలోని జమ్మినగర్‌లో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్, సీసీ రోడ్లను శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభిస్తారని బుధవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు తెలుగుపేట డ్రైనేజీ కాలువలను ప్రారంభిస్తారని, ఉదయం 11 గంటలకు సచివాలయం -2 పరిధిలో పెన్షన్ పెంపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు. ఆ తరువాత 11:30 గంటలకు రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు గండిపేట, విజయనగర్ కాలనీల్లో సీసీ రోడ్లు, 12:30 గంటలకు షాదీఖానా దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనం ప్రారంభోత్సవంలో పాల్గొంటారని చెప్పారు. చివరగా మధ్యాహ్నం 1 గంటకు కాలేజీ బైపాస్ రోడ్‌లో పెద్ద మార్కెట్ వద్ద సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వెల్లడించారు. మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్లు, కోఆప్షన్ నెంబర్లు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు వేల్పనూరు పీహెచ్‌సీ ప్రారంభం

వేల్పనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన పైస్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బుధవారం ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు 10 పడకల ఆసుపత్రిని ప్రారంభించి ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు భాస్కర్ కోరారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్మికులు, సీఐటీయూ నాయకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ జీఓ నెంబరు-7 ప్రకారం వేతనాలు అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఎస్ఐలో ఉన్న లోపాలను సవరించి సక్రమంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్, నాగేశ్వరరావు, విజయకుమార్, నాగన్న, అశోక్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జయంతి

శ్రీశైలంప్రాజెక్ట్: సావిత్రిబాయి పూలే జయంతిని మంగళవారం శ్రీశైలం ప్రాజెక్ట్ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.ఆశీర్వాదం, కళాశాల అధ్యాపకులు సూర్యనారాయణల ఆధ్వర్యంలో విద్యార్థులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్త్రీ విద్య కోసం సావిత్రిబాయి పూలే అవలంబించిన అక్షర జ్ఞాన మార్గాన్ని ఆశీర్వాదం విద్యార్థులకు వివరించారు.

పెన్షన్‌దారుల పత్రాల స్వీకరణ

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ దారుల జీవన ప్రమాణ పత్రాల స్వీకరణ ప్రారంభమైనట్లు జిల్లా ఖజానా, గణాంక శాఖ అధికారిణి లక్ష్మిదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది పెన్షన్ కొనసాగింపు కోసం జీవన ప్రమాణ పత్రాలు(లైఫ్ సర్టిఫికెట్లు) సమర్పించాల్సి ఉంటుందని, పెన్షన్ దారులకు మెరుగైన వసతులు కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణకు అవకాశం కల్పించిందన్నారు. సర్టిఫికెట్లను ఫిబ్రవరి 29వ తేదీలోగా సమర్పించాలన్నారు. నివాసిత ప్రాంతంలో ఉన్న మీసేవ, నెట్ సెంటర్, ఉప ఖజానా కార్యాలయాల్లో సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా


ఎమ్మెల్యే ఆర్థర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్ జాకీర్‌హుసేన్, నాయకులు

నందికొట్కూరు: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీఆర్‌టీయూ నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. తమ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు మధుసుదన్‌రావు, జాకీర్ హుసేన్, నరసయ్య, జిల్లా నాయకులు ఎం. జాకీర్ హుసేన్, ప్రసాదు, మండల నాయకులు హనుమంతురెడ్డి, జంగిల్ సాహెబ్ ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే సీఎం వైఎస్ జగనన్న చొరవ తీసుకుని పరిష్కరించే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలరు జాకీర్ హుసేన్, ధర్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముజీబ్ ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఏఓ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జూపాడుబంగ్లా, తాటిపాడు గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు వంగల లక్ష్మిదేవి, మొట్టిబాలస్వామి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రైతులకు ప్రభుత్వం రాయితీపై డ్రోన్లు మంజూరు చేస్తుందన్నారు. డ్రోన్ల ద్వారా సులభంగా ఎలాంటి హానికరం లేకుండా కేవలం అరగంట వ్యవధిలోనే తక్కువ పెట్టుబడితో రసాయనిక మందులు పంటలపై పిచికారీ చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ గౌరీబాయి, ఏపీఎం అంబమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, కార్యదర్శి శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

జూపాడుబంగ్లా: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ ముందుంటుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.జాకీర్‌హుసేన్ తెలిపారు. జూపాడుబంగ్లా మండల విద్యాధికారి కార్యాలయం వద్ద మంగళవారం ఎంఈఓ-2 శ్రీనివాసులు అధ్వర్యంలో పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు హనుమంతరెడ్డి, ఎం.జాకీర్‌హుసేన్, జిల్లా కౌన్సిలర్ శ్రీనివాసులు కల్కి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆత్మకూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఆత్మకూరు: పట్టణంలో బుధవారం నుంచి ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ మెయిన్‌బజార్ వద్ద ఎస్పీజీ పాలెం సచివాలయం-1 పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 10న కొత్తపేట, 17న ఇందిరానగర్, 24న అర్బన్‌కాలనీ, 31న ఎస్పీజీపాలెం- 2, ఫిబ్రవరి 7న గరీబ్‌నగర్ సచివాలయం పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

శ్రీశైలం చేరిన అయోధ్య రాముని అక్షింతలు


అక్షింతలకు ఆహ్వానం పలుకుతున్న భక్తులు


శ్రీశైలానికి చేరిన అయోధ్య రామ అక్షింతలు

శ్రీశైలం: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న గడప గడపకు అయోధ్య అక్షింతలు చేరవేసే కార్యక్రమంలో భాగంగా మంగళవారం అక్షింతలు శ్రీశైలానికి చేరాయి. వాటికి స్థానిక గంగాధర మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నుంచి మండల వ్యాప్తంగా అందరి ఇళ్లకు శ్రీరాముని అక్షింతలు అందించే కార్యక్రమం ప్రారంభిస్తామని స్థానిక శ్రీరామ సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 22న అయోధ్య ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా ముందుగానే ప్రతిష్ఠించిన బాలరాముని విగ్రహానికి పూజలు చేసి, ఆ అక్షింతలన్నింటినీ దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్నారని తెలిపారు.

పాడిపశువుల ఆరోగ్యానికి ప్రత్యేక కార్యక్రమాలు


తమ్మడపల్లెలో పశువుల ఆరోగ్యాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ గోవిందనాయక్

మహానంది: పాడిపశువుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తోందని నంద్యాల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గోవిందనాయక్ తెలిపారు. తమ్మడపల్లె గ్రామంలో పశువైద్య కేంద్రం వద్ద మంగళవారం ఎఫ్ఎండీసీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ మేరకు డాక్టర్ గోవిందనాయక్ మాట్లాడుతూ పాడి రైతులు పెంచుకుంటున్న పశువుల ఆరోగ్యం కాపాడుతూ వాటి ద్వారా రైతులకు ఆర్థికంగా ఆదాయం అందించేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. పశువులకు ఆరోగ్య కార్డులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, డాక్టర్ కరుణాకర్, లైవ్‌స్టాక్ ఆఫీసర్ సులోచన, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యుడి అందాలు

మహానంది : సూర్యోదయం, సూర్యాస్తమయం సమయంలో ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. భువిపై ప్రవహించే గంగమ్మను తాకిన అరుణ కాంతులు నీటిపై మండే మంటల్లా అగుపించాయి. మంగళ వారం సాయంత్రం మహానందిలో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.


చెరువులోని నీటిపై అరుణవర్ణ కాంతులు

ఆలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళం


నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

మహానంది: బండి ఆత్మకూరు మండలం సంతజూటూరు గ్రామంలోని మేదర కాలనీలో నిర్మిస్తున్న మల్లెలమ్మ దేవాలయానికి ఎమ్మెల్యే రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. మంగళవారం విరాళానికి సంబంధించిన నగదును దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దశ్యం

వెలుగోడు: ఎస్టీయూ 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డైమండ్ సెలబ్రేషన్స్‌ను పురస్కరించుకొని నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ లాలం రమేష్, ఎంపీడీఓ అమానుల్లా, ఎంఈవో బ్రహ్మంనాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులకు వారు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామలింగారెడ్డి, షఫీ, మొహినుద్దీన్, ఎస్టీయూ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఈవీ గోపన్‌కృష్ణ పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

పాములపాడు: ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ బుధవారం మండలానికి రానున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. మధ్యాహ్నం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశ భవనంలో పెంచిన పింఛన్ రూ.3,000 పంపిణీని ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 3గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం 2వ విడతగా మద్దూరు గ్రామంలో పర్యటిస్తారన్నారు. మండలంలో ఈ నెల నుంచి 51 మందికి నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయని, వీటితో కలిపి మొత్తం 5,962 మంది పింఛన్ దారులున్నారని చెప్పారు.

కొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ మేరీ అధ్యక్షతన నిర్వహిస్తున్న పెంచిన, నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరు కానున్నారు. మండలంలో 4,279 మంది పింఛన్‌దారులు ఉండగా కొత్తగా 63 మందికి మంజూరైనట్లు ఎంపీడీఓ మేరీ తెలిపారు.

సర్దార్ హాశ్మీ సేవలు మరువలేనివి

ఆత్మకూరు: కళాకారుడు సర్దార్ హాశ్మీ సేవలు మరువలేనివని ప్రజానాట్య మండలి నాయకులు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో మంగళవారం సర్దార్ హాశ్మీ వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికిపూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి నాయకులు రణధీర్, స్వాములు, ఇస్మాయిల్, రామ్‌నాయక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణుల ఆరోగ్యానికి సురక్ష


మాసపేటలో ఈసీజీ నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామీణుల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రామనాథం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాసపేట గ్రామంలో రెండో విడత నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష క్యాంపును సందర్శించారు. రోగులకు వైద్య పరీక్షల గురించి వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో శారదాబాయి, జెడ్పీటీసీ యుగంధరరెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

నందికొట్కూరు: బాలికపై అత్యాచార యత్నం జరిగిన సంఘటన మంగళవారం కొణిదేల గ్రామంలో చోటు చేసుకుంది. టౌన్ సీఐ ప్రకాష్ కుమార్ తెలిపిన మేరకు వివరాలు.. మండల పరిధిలోని కొణిదేల గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన శేఖర్ అనే వృద్ధుడు ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచార యత్నానికి పాల్పడినట్లు బాధితురాలు తెలిపింది. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తెలిపారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తునట్లు చెప్పారు.

క్రీడలకు పెద్దపీట


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి


పగిద్యాలలో టాస్ వేసి ఖోఖో మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆడుదాం..ఆంధ్ర క్రీడలను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. సచివాలయ స్థాయిలో క్రికెట్, వాలీబాల్, షటిల్, ఖో, ఖో పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ క్రికెట్ బ్యాటింగ్ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభ వెలికితీయడానికే ఆడుదాం...ఆంధ్ర పోటీలను సీఎం వైఎస్ జగనన్న నిర్వహిస్తునట్లు చెప్పారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు చిన్నరాజు, లాలు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, శ్రీనివాసులు, విజ్జి, రామకృష్ణ, శాప్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు జోరతి, జెసింత, రియాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడలు

పగిద్యాల: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో నిర్వహిస్తున్నా ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. మంగళవారం మండలంలోని నెహ్రూనగర్, పాత ముచ్చుమర్రి, పగిద్యాల, పడమర ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఖోఖో, క్రికెట్ పోటీలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖోఖో, క్రికెట్ పోటీలను ఎంపీడీఓ వెంకటరమణ టాస్ ఎగరేసి ప్రారంభించారు. కార్యక్రమానికి సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రా రెడ్డి, జావేద్, వీరన్నయాదవ్, సమతయశోదర తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మండలంలోని తుమ్మలూరు, జూటూరు గ్రామాల్లో అట్టహాసంగా నిర్వహించారు. తుమ్మలూరులో ఎంపీడీఓ గోపీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, సర్పంచు వరప్రసాద్, జూటూరులో సర్పంచు నాయిని సావిత్రమ్మ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో స్పెషల్ ఆఫీసర్ విమలమ్మ, ఏఓ ఫణీశ్వరరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణ, ఉపేంద్ర తదితరులు తదితరులు పాల్గొన్నారు.

మహానంది: మండల పరిధిలోని గాజులపల్లెలో ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా మంగళవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలను సర్పంచ్ చంటి ప్రారంభించారు.


జూటూరులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


గాజులపల్లెలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కొనసాగిన అంగన్‌వాడీల దీక్షలు

పాములపాడు: అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన దీక్షలు మంగళవారం 22వ రోజు కొనసాగించారు. మండల కేంద్రంలో 22 సంఖ్య ఆకారంలో కూర్చుని, బస్సుల అద్దాలు తుడిచి నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకూ సమ్మె విరమించే ప్రసక్తి లేదని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ లీడర్లు పద్మావతి, వెంకటరమణమ్మ, ప్రసన్నలక్ష్మీ తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమకు నెలకు రూ.26వేలు వేతనమివ్వాలని కోరారు. మంగళవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని దున్నపోతుకు ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు.

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ సంఘం నాయకురాల్లు లక్ష్మీదేవి, ప్రమీళ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని అంబేడ్కర్‌సెంటర్ లో ఉన్న దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు 22వ రోజు దీక్షను కొనసాగించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను చూసైనా తమ జీతాలను పెంచాలని కోరారు.